# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-10-2023** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **తెలంగాణా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపముఖ్య మంత్రి నారాయణస్వామి తెలిపారు.**

**3.** **ఆయిల్ పాం సాగులో తెలంగాణ దేశంలోనే ప్రథమస్థానంలో ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.**

**4.** **దేశ ప్రజలకు జనరంజకమైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ఆరంభమై నిన్నటితో తొమ్మిదేళ్లు పూర్తయింది.**

**5.** **ఆసియా క్రీడల్లో 69 పతకాలతో భారతదేశం నాలుగవ స్థానంలో కొనసాగుతోంది.**

==========================

తెలంగాణా రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చే ఆస్పత్రులు, రైల్వేలైన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా నిన్న ఇందూరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన “జన గర్జన” సభలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణా ప్రజలలో ఎన్నో శక్తి సామర్థ్యాలు, తెలివి తేటలు వున్నాయని కొనియాడారు. ప్రపంచానికి కరోనా టీకా అందించిన ఘనత తెలంగాణా రాష్ట్రానిదేనని ప్రధాని పేర్కొంటూ....

వాయిస్ - 35 సెకన్లు

ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించి 8 వేల 21 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రధానమంత్రి ప్రారంభించిన అభివృద్ధి పనులలో పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 6 వేల కోట్ల రూపాయలతో నిర్మించిన అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ ప్లాంటులో 8 వందల మెగావాట్ల తొలి యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. 20 జిల్లా కేంద్ర ఆస్పత్రులలో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ విభాగాలకు శంకుస్థాపన చేశారు. మనోహరాబాద్-సిద్దిపేట మధ్య నిర్మించిన 76 కిలోమీటర్ల మార్గాన్ని, మన్మాడ్-ముద్కేడ్-మహబూబ్ నగర్-డోన్ మధ్య చేపట్టిన రైల్వే విద్యుదీకరణ ప్రాజెక్టును, సిద్దిపేట-సికింద్రాబాద్ మార్గంలో రైలు సర్వీసును కూడా ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి వెల్లడించారు. చిత్తూరులోని జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ... మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తమ ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. ప్రచార ఆర్భాటాలకు ప్రభుత్వం దూరమని స్పష్టం చేశారు. అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

---------------------------

ఆయిల్ పాం సాగులో తెలంగాణ దేశంలోనే ప్రథమస్థానంలో ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో 200 కోట్ల రూపాయలతో రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ సంస్థ నిర్మిస్తున్న పామాయిల్ కర్మాగార పనులకు మంత్రి నిన్న భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాం సాగువైపు రైతులను ప్రోత్సహిస్తోందని... ఎకరాకు 50 వేల 900 రూపాయలను సబ్సిడీ కింద ఇస్తోందని అన్నారు. రాష్ట్రంలోని 12 ప్రాంతాల్లో పామాయిల్ కర్మాగారాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియచేశారు.

---------------------------

భారతదేశాన్ని పరిశుభ్రంగా తీర్చి దిద్దేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ ఒకటవ తేదీన పిలుపునిచ్చిన "ఒకటవ తేదీ, ఒక గంట-అందరం కలిసి" అన్న కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా 9 లక్షల ప్రదేశాలలో 8 కోట్ల 75 లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారని ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వీధులు, రైల్వే ట్రాక్‌లు, ఆరోగ్య సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, నివాస ప్రాంతాలు, దేవాలయాలు తదితర ప్రాంతాలలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పరిశుభ్రం చేశారని ఆ ప్రకటన పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని కళింగపట్నం, మత్స్యలేశం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో నిన్న ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించి అక్కడి రోగులతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్షను 5 అంచెలుగా నిర్వహిస్తున్నామని... దీనిని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం ప్రథమ ప్రాధాన్యాలుగా తమ ప్రభుత్వం ఎంచుకుని పనిచేస్తోందని... ఈ రెండు రంగాలకూ అధికంగా నిధులు వెచ్చిస్తున్నామని ధర్మాన ప్రసాదరావు వివరించారు.

---------------------------

ఆకాశవాణి, దూరదర్శన్‌ల ద్వారా దేశ ప్రజలతో సంభాషిస్తూ... దేశానికి సంబంధించిన వివిధ అంశాలను వారితో పంచుకుంటూ... ప్రజలకు "మీతో పాటు నేనున్నాను" అని భరోసా ఇస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా నిర్వహించిన విశేష ప్రజాదరణ పొందిన "మన్ కీ బాత్-మనసులోని మాట కార్యక్రమం" నిన్నటితో 9 వసంతాలు పూర్తి చేసుకుంది. 2014వ సంవత్సరం అక్టోబర్ 3వ తేదీ విజయదశమి రోజున ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ప్రతినెలా చివరి ఆదివారం నరేంద్ర మోదీ ప్రజలతో మమేకమవుతున్నారు. ఒక ప్రసార మాధ్యమ కార్యక్రమం ద్వారా దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి... ప్రజల హృదయాలకు ఇంతగా చేరువ కావడం, వారిని చైతన్యవంతులను చేయడం అరుదైన విషయం. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇటువంటి ప్రజారంజక కార్యక్రమం ఇంతగా జరగలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇప్పటివరకు మన్ కీ బాత్ కార్యక్రమం 105 సంచికలు పూర్తి చేసుకుని... ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేస్తోంది. మన్ కీ బాత్ కోట్లాది ప్రజల

మనోగతమని ప్రధాని ఒక సందర్భంలో వివరిస్తూ...

వాయిస్ - 30 సెకన్లు

---------------------------

చైనాలోని హాంగ్‌జోలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో వివిధ అంశాల్లో భారతదేశం పతకాల సాధన దిశగా ముందుకు సాగుతోంది. భారతదేశం నిన్న ఒక్క రోజే 9 పతకాలు కైవసం చేసుకుంది. వీటిలో 2 స్వర్ణ, 2 రజత, 5 కాంస్య పతకాలు వున్నాయి. దీంతో... ఆసియా క్రీడల పతకాల పట్టికలో మొత్తం 69 పతకాలు సాధించి భారతదేశం 4వ స్థానంలో కొనసాగుతోంది. ఈ 69 పతకాలలో 15 స్వర్ణ, 26 రజత, 28 కాంస్య పతకాలు వున్నాయి.

---------------------------

స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ బేలా ఎం. త్రివేదిలతో కూడిన ధర్మాసనం తెలిపింది.

---------------------------

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా చంద్రబాబు నాయుడు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. ఆ తరువాత సి.ఐ.డి. తరఫున ఎ.జి. శ్రీరామ్ వాదనలు కొనసాగించారు. ఎ.జి. వాదనలకు లూథ్రా కౌంటరు వాదనలు వినిపిస్తూ... కేవలం రాజకీయ దురుద్దేశ్యంతోనే సి.ఐ.డి. అధికారులు కేసు నమోదు చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం... చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగించిన ఉన్నత న్యాయస్థానం తన తీర్పును రిజర్వు చేసింది.

ఇలాఉండగా... ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు సంబంధించిన సి.ఐ.డి. విచారణను అక్టోబర్ 10వ తేదీకి వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

ఈ రోజు ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షకునిగా ఖ్యాతి గడించిన జంతు ప్రేమికులు, ఇటలీకి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ అసిసి 1226వ సంవత్సరం అక్టోబర్ 3వ తేదీన తుది శ్వాస విడిచారు. ఆయన గౌరవార్థం ఆ మరుసటి రోజు... అక్టోబర్ 4వ తేదీన ఆ ప్రాంతంలో పండుగ వంటి ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా అక్టోబర్ 4వ తేదీన ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పెంపొందించడం, వాటిని సంరక్షించడం, జంతువుల హక్కులను కాపాడడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. జంతు సంక్షేమ దినోత్సవాన్ని మొదటిసారిగా 1931వ సంవత్సరంలో అధికారికంగా నిర్వహించారు.

---------------------------

భౌతిక శాస్త్రంలో 2023 సంవత్సరానికి సంబంధించి అమెరికాకు చెందిన పెర్రీ ఆగోస్టని, ఫెరెంక్ క్రౌజ్, ఎల్ హ్యూలియర్‌లకు నోబుల్ పురస్కారం లభించింది. ఒక పదార్థంలోని ఎలక్ట్రాన్ డైనమిక్స్‌పై చేసిన విలువైన పరిశోధనలకు ఈ ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబుల్ పురస్కారం దక్కింది.

=====================